తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## మోటారు సైకిల్‌ను ఢీకొన్న లారీ- స్కూటర్ దగ్ధం

### ఒకరికి తీవ్రగాయాలు



నారాయణవనం, జూన్ 1 ప్రభాతవార్త : పుత్తూరు-చెన్నై జాతీయ రహదారిలోని నారాయణవనం మండలం పాలమంగళం వద్ద శనివారం సాయంత్రం పుత్తూరు వైపు నుంచి చెన్నైకి వెళుతున్న లారీ ఎదురుగా వస్తున్న మోటారుసైకిల్‌ని ఢీకొంది. ఈ ప్రమాదంలో నింద్ర మండలం ఐయ్యవారికండ్రిగ గ్రామానికి చెందిన వేణు(41)కి తీవ్రగాయాలయ్యాయి. లారీ మోటారుసైకిల్‌ని సుమారు 10 అడుగుల దూరం వరకు లాకెళ్లడంతో పెట్రోల్ లీక్ అయి మంటలో కాలిపోయింది. ప్రమాదానికి కారణమైన లారీని హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌కి తీసుకొచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

## సర్వవిద్యాప్రదాత హనుమంతుడు

### -సువిద్యేంద్రతీర్థస్వామి



తిరుమల,జూన్ 1 ప్రభాతవార్తప్రతినిధి: హనుమంతుడు సర్వవిద్యాప్రదాత అని బెంగుళూరు రాఘవేంద్రస్వామి మఠాధిపతి సువిద్యేంద్ర తీర్థస్వామి పేర్కొన్నారు. హనుమ జ్జయంతి వేడుకల్లో భాగంగా శనివారం సాయంత్రం తిరుమలలోని నాదనీరాజనం వేదికపై జపాలి తీర్థంలో భక్తిసంగీత కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ఉపన్యసించారు. సూర్యుడు సకల విద్యలను హనుమంతునికి బోధించాడని, హనుమంతుని సేవిస్తే సత్ప్రవర్తన, ధైర్యం, యశస్సు,విజయం సిద్దిస్తుందని స్వామి తెలిపారు. ఆకాశగంగ,జపాలి తీర్థంలో జరిగిన భక్తి కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# అల్యూమినియం కర్మాగారంలో గ్యాస్‌లీక్!

### 30మంది కార్మికులకు తీవ్ర అస్వస్థత - కార్మికులతో కిక్కిరిసిన బాలాజీ ఆస్పత్రి

### న ఎవరికి ప్రాణాపాయం లేదు - ఆస్పత్రి వర్గాలు





చికిత్స పొందుతున్న కార్మికులు, బాధితులను పరామర్శిస్తున్న గురుమూర్తి

ఏర్పేడు, రేణిగుంట, జూన్1 ప్రభాతవార్త; కర్మాగార యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా కార్మాగారంలో ప్రమాదం చోటు చేసుకుంది 30మంది కార్మికులు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన ఏర్పేడు- వెంకటగిరి రహదారిలోని రాజులపాళ్యం వద్ద శనివారం చోటు చేసుకుంది. ఏర్పేడు సిఐ శ్రీరామ శ్రీనివాస్ కథనం మేరకు సిఎంఆర్ అల్యూమినియం కర్మాగారంలో గ్యాస్ లీక్ కారణంగా 30మంది కార్మికులు అస్వస్థతకు గురయ్యారు, అస్వస్థతకు గురైన వారిని చికిత్స నిమిత్తం విమానాశ్రయం సమీపంలోని బాలాజి హాస్పిటల్‌కి తరలించినట్లు ఆయన తెలిపారు. కర్మాగారం ట్రైలర్ దశలోనే ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏదైనా ప్రాణాపాయం సంభవించినట్లు ఐతే కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.ఇందులో 25మంది అమ్మాయిలు ఉన్నారు. ఏకో అల్యూమినియం కర్మాగారంలో గ్యాస్‌లీక్ అయిన ప్రమాదంలో సుమారు 30మందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారని తెలుసుకున్న తిరుపతి ఎంపీ మిద్దెల గురుమూర్తి హుటాహుటిన అస్వస్థతకు గురైన కార్మికులను రేణిగుంట బాలాజీ హస్పిటల్‌కి వెళ్లి పరామర్శించారు. పొల్యూషన్ బోర్డు వారు నిర్లక్ష్యంగా అనుమతులు ఇవ్వడం వల్లనే ఇలాంటి ప్రమాదాలకు చవిచూడాల్సి వస్తోందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**న ఎవరికి ప్రాణాపాయం లేదు - ఆస్పత్రి వర్గాలు**

రేణిగుంట బాలాజీ ఆస్పత్రి ఏర్పేడు మండలం సీఎంఆర్ కర్మాగారం కార్మికులతో మంగళ, శనివారాల్లో నిండిపోయింది. ఎమర్జెన్సీ వార్డులోని బెడ్లో కార్మికులు చికిత్స పొందుతున్నారు. కర్మాగారంలో వెలువడిన గ్యాస్ వల్ల అక్కడ పని చేస్తున్న కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. సుమారు 35 మంది కార్మికులు చికిత్స నిమిత్తం కంపెనీ యాజమాన్యం బాలాజీ ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్యులు ఎంతో శ్రమపడి అస్వస్థకు గురైన వారికి వైద్య సేవలు చేశారు. సాయంత్రానికి కార్మికుల ఆరోగ్యాలు కుదుటపడ్డాయి. వీరిలో 30 మంది మహిళలు ఉండడం గమనార్హం. ఎవరికిఎలాంటి ప్రాణహాని సంభవించలేదని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. కార్మికుల బంధువులు మాత్రం కర్మాగారంలోజరిగిన సంఘటన పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు న్యాయం చేస్తామని, వారికి ఆరోగ్య భద్రత కల్పిస్తామని కంపెనీ హెచ్‌ఆర్ చంద్రశేఖర్ తెలిపారు. కార్మికులకు తీసిన ఎక్స్ రేలు, ఈసీజీలో పరిశీలించామని వారికి ఎలాంటి ఆరోగ్యపరమైన ఇబ్బందులు లేవని డ్యూటీ డాక్టర్ తెలిపారు. కొంత మందికి ఊపిరి పీల్చుకోవడం కష్టంగా మారడంతో ఆక్సిజన్ ఏర్పాటు చేశామన్నారు. తిరుపతి వైసీపీ ఎంపీ(అభ్యర్థి) గురుమూర్తి బాధితులను పరామర్శించి ధైర్యవచనాలు తెలిపారు.

### గోవిందుని సన్నిధిలో

# హనుమంతుని జయంతి వేడుకలు

### -మల్లెపూలతో విశేష అర్చన







తిరుమల,జూన్ 1 ప్రభాతవార్తప్రతినిధి: దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల కొండల్లో అంజనాద్రి పర్వతంతోబాటు జపాలి, ఏడవమైలు, ఆలయం సమీపంలో శనివారం ఉదయం నుండి రాత్రి వరకు "జైశ్రీరామ్"నినాదం మిన్నంటాయి. హనుమజ్జయంతి పర్వదినం సందర్భంగా శనివారం ఉదయం అంజనాద్రిలోని "బాలాంజనేయస్వామి, అంజనాదేవికి" మల్లెపూలతో ఆలయ అర్చకులు విశేష అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం చేయించి ప్రసాద వితరణ చేశారు.

**పట్టువస్త్రాలు సమర్పణ:**

ఆకాశగంగ ప్రాంతంలోని అంజనాద్రి పర్వతంపై బాలాం జనేయస్వామికి ఉపచారాలు, పంచామృత స్నపన తిరు మంజనం నిర్వహించారు. ఉదయం టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి హనుమజ్జయంతి పర్వదినం సందర్భంగా శని వారం ఉదయం తిరుమలలో మరో ప్రసిద్ధక్షేత్రం అంజనాద్రి పర్వతాల్లో జన్మించిన "బాలాంజనేయ స్వామి ఆలయంలో బాలాంజనేయునికి, అంజనాదేవికి" విశేష అభిషేకాలు నిర్వహించారు.టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి భక్తితో స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వైఖానస ఆగమ సలహాదారుడు మోహనరంగాచార్యులు, ఆలయ పార్‌పత్తేదార్ తులసీప్రసాద్, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, డిప్యూటీ ఈఓ సెల్వం, హథీరాంజీమఠం మహంతు ఓంప్రకాష్‌దాస్,వేదవిజ్ఞానపీఠం పండితులు పాల్గొన్నారు. తిరుమలలోని ఆలయానికి సమీపంలో ఉన్న బేడి ఆంజనేయస్వామికి, తిరుమల ఘాట్‌లో ఏడవమైలువద్ద ప్రసన్నాంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి ప్రసాద వితరణ చేశారు.

# రోహిణి కార్తె విశ్వరూపం : సెగలు సెగలు

### రోజు రోజుకు పెరుగుతున్న ఎండలు - తల్లడిల్లుతున్న జనం



వయ్యకు ధారా పాత్ర ఏర్పాటుచేసిన దృశ్యం

శ్రీకాళహస్తి,జూన్ 1 ప్రభాతవార్త

పుణ్యక్షేత్రంలోని ప్రజలు ఎండలతో తల్లడిల్లుతున్నారు.రోహిని కార్తే తన విశ్వరూపాన్ని చూపుతుంది. రోహిణిలో రోళ్లు పగులుతాయనే నానుడి ఎందుకు వచ్చిందో ప్రస్తుతం భానుడు చూపుతున్న ప్రతాపాన్ని బట్టి తెలుస్తుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఎండలు భయభ్రాంతుల్ని చేస్తున్నాయి. సూర్యోదయంకన్నా ముందు నుంచే ఎండ వేడిమి సెగలు ప్రారంభమౌతున్నాయి. మరీ మధ్యాహ్నం వేళల్లో ఎసిలు కూడా సరిపోవటం లేదంటే పరిస్థితి అర్థమౌతుంది.ఇక సాయంత్రం వేళల్లో గాలి లేక పోగా సెగలతో స్నానం చేసినట్లు మారింది.

**రోజు రోజుకు పెరుగుతున్న ఎండలు**

ఏ రోజు కా రోజూ ఎండలు తగ్గుతాయనే ఆశలు తప్ప రోహిణి కార్తె దడ పుట్టిస్తుంది. ఉదయం ఆకాశం మేఘావృతమైనా మధ్యాహ్నానికి ఎండ 43-44దాటిన డిగ్రీల సెల్సియస్‌గా నమోదౌతుంది. ఇక రోడ్ల మీద నడక దుర్లభంగా మారింది. మధ్యాహ్నం 1 గంటల నుంచి జనం కనబడటం లేదు. జనం అత్యవసర పనులున్నా బయటకు రావటానికి భయపడుతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో రోడ్ల మీద నడిచే వారు ఇంటికెళ్ళ గానే పడిపోతున్నారు. గతంలో భూగర్భ జలాలు బాగున్నపుడు ఎండలున్నా చల్లటి గాలులతో ఉపశమనం పొందుతున్నారు. కానీ నేడు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. శివయ్యకే 'ధారా పాత్ర'ను ఏర్పాటు చేస్తున్నారంటే పరిస్థితి ఏమిటన్నది అర్థమౌతుంది.

**రోహిణి ప్రతాపం:**

సాధారణంగా ఎండాకాలంలోని కార్తెల్లో 'రోహిణి' ప్రమాదకరమైనదనే వాదన ఉంది. పూర్వం రోహిణిలో రోళ్ళు పగులుతాయనే నానుడి ఉంది.అయితే ఈ ఏడాది రోహిణి ప్రతాపం చూపుతుంది. ఎండలు దడపుట్టిస్తున్నాయి.ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని స్థితి చోటు చేసుకుంది. బాబోయ్ ఎండలు ఎప్పుడూ చూడలేదంటూ వృద్ధులు వాపోతున్నారు.అతి సారంతో పసిపిల్లలు కూడా మృత్యువాత పడుతున్నారు.

## చేపల మార్కెట్ దగ్ధం

### 7 లక్షలు నష్టం



విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో దగ్ధమైన చేపల మార్కెట్

గూడూరు, జూన్ 1, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని ఐసిఎస్ రోడ్డులో ఉన్న తాత్కాలిక చాపల మార్కెట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 7 లక్షల రూపాయిల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు వ్యక్తం చేస్తున్నారు. చాపల మార్కెట్‌లోని ఒక దుకాణంలో షార్టు సర్క్యూట్ ఏర్పడిన కారణంగా మండలు చెలరేగి సుమారు నాలుగు షాపులు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయి. దుకాణాల్లోని ఎండు చేపలు, పచ్చి చేపలు అగ్నిలో కాలిపోవడంతో సుమారు ఏడు లక్షల రూపాయిలు మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు వ్యక్తం చేస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలాలని చేరుకొని మంటలను అదుపు చేశారు.

## కాణిపాకంలో

# శ్రీహనుమాన్ జయంతి వేడుకలు



శ్రీహనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారి పట్టువస్త్రాలను పూజా సామాగ్రిని తీసుకువెళుతున్న ఆలయ ఈఓ తదితరులు

కాణిపాకం, జూన్ 1 ప్రభాతవార్త: శ్రీహనుమజ్జయంతి వేడుకలను కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో ఈవేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు ఉదయం స్వామివారి సుప్రభాతసేవ, ప్రత్యేకాభిషేకం నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని చక్కగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించి దూప దీప నైవేద్యాలను సమర్పించారు. ఈసందర్భంగా స్వామివారికి దేవస్థానం తరపున ఆలయ ఈఓ వెంకటేశు, ఏఈఓ హరిమాధవరెడ్డి, అధికారులు, అర్చకులు మంగళ వాయిద్యాల నడుమ నూతన పట్టు వస్త్రాలను, పూజా సామాగ్రిని తీసుకువెళ్ళి అందజేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. హనుమాన్ జయంతి సందర్భంగా స్వామి దర్శనార్థం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈకార్యక్రమంలో ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్, ఆలయ అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

### భక్తజనసంద్రంగా

# ఏడుకొండలు



తిరుమల,జూన్ 1 ప్రభాతవార్తప్రతినిధి: వేసవిసెలవులు ముగింపుకు వస్తుండటం...వారాంతం ,వరుససెలవులతో ఏడుకొండలు భక్తజనసంద్రంగా మారాయి. శనివారం ఉదయానికే తిరుమలలో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయి ఆలయం వెలుపల మూడుకిలోమీటర్లు భక్తుల క్యూలైన్లు శిలాతోరణం వరకు చేరాయి. వెంకన్న దర్శనానికి 30గంటలపైగానే భక్తులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది.

## వివాహిత అనుమానస్పద మృతి..!

### పూడ్చిన శవానికి పంచనామా

వరదయ్యపాలెం(నారాయణవనం), జూన్ 1 ప్రభాతవార్త :



పూడ్చిన సుమయా మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

వరదయ్యపాలెం మండలం గోపాలపురం కాలనీకి చెందిన సుమయా(20) అనుమానస్పదంగా మృతి చెందింది. ఆమె మృత దేహానికి దహనక్రియలు చేసినప్పటికి బంధువుల అనుమానంతో పూడ్చి శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం చేశారు. సత్యవేడు సిఐ దివాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్మశాన వాటికలోనే పూడ్చిన మృత దేహాన్ని బయటకు తీసి పంచ నామా చేశారు. ఈ సంద ర్భంగా సిఐ మీడియాతో మాట్లా డుతూ సుమయా మృతిపై అనుమానం రావడంతోనే శవపంచనామా చేసినట్టు చెప్పారు. శవ పంచనా మాలో నిజం బయట పడుతుందన్నారు. ఆమె భర్త ఫాసిల్‌ను అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. ఇప్ప టికే ఆమెకు రెండు సంవత్సరాల కుమారై, మరో చిన్నారి ఉన్నారు. సుమయా మృతిపై గ్రామస్తులు రకర కాలుగా చర్చించుకుంటున్నారు. శవ పంచనామాలో వచ్చే రిపోర్టు మేరకు స్పందిస్తామని సిఐ తెలిపారు.

# పేరుకు పుణ్యక్షేత్రం : పారదర్శకత పూజ్యం

### ఇక్కడ రెగ్యూలర్ ఉద్యోగులు ప్రేక్షకులు: పలుకుబడి కల్గిన వారిదే పాలన

శ్రీకాళహస్తి,జూన్ 1 ప్రభాతవార్త

దేవాదాయశాఖ పని తీరు రోజు రోజుకు తీసికట్టుగా మారుతుంది. ముఖ్యంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో పరిపాలనా తీరు పరిశీలిస్తే ఎవరికైనా ఆశ్చర్యమేస్తుంది. ఈ ఆలయంలో కొందరు అధికారులను ఎలాంటి పని లేకుండా ఒక్క ఫైల్ చూసే అవకాశం లేకుండా ఓ ఎసి గది చక్కటి ఫర్నిచర్‌ను అందించి నెలకు రూ.1.2లక్షలు జీతం చెల్లిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఇప్పటికే ఆలయంలో ఇద్దరు ఎసిలున్నారు. ఏ కారణాల చేతనో మరో ఎసిని పెంచుల కోన నుంచి ఇక్కడకు బదిలి చేసారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిబంధనలకు తిలోదకాలిచ్చి బిల్లులు చెల్లింపుకు వత్తిడి వస్తున్నట్లు సమాచారం.ఇక్కడ రెగ్యూలర్ సిబ్బంది దిష్టిబొమ్మలు కాగా అవుట్ సోర్సింగ్ సిబ్బంది పరిపాలన సాగిస్తున్నారు. ఇటీవల కాలంలో ఇబ్బడి ముబ్బడిగా నిబంధనలకు తిలోదకాలిచ్చి నియామకాలు జరిగాయి. ఓ వైపు ప్రభుత్వ ఉద్యోగాలకు అవకాశం లేదంటూనే మరో వైపు దొడ్డి దారి నియామకాలు సాగాయి.

**శ్రీకాళహస్తీశ్వరాలయంలో సిబ్బంది ఇలా ఉన్నారు . . .**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఓ సారి సిబ్బంది పరిశీలిస్తే నలుగురు ఎఇఓలు ఉండాల్సి ఉండగా నలుగురు ఉన్నారు. అలాగే సూపరింటెండెంట్‌లు 5మందికి 5 మంది ఉన్నారు.అయితే సీనియర్ అసిస్టెంట్లు కూడా కేడర్ సంఖ్య ప్రకారం ఉన్నారు. అయితే ఫైళ్ళు రాయాల్సిన జూనియర్ అసిస్టెంట్ల సంఖ్య లేదు. ఎవరైతే రిటైర్ అవుతున్నారో వారి స్థానంలో కొత్తవారిని నియమించటం లేదు.దాంతో ఫైళ్ళు రాసే సిబ్బంది కొరత ఏర్పడింది.

**అవుట్ సోర్సింగ్ పెత్తనం: రెగ్యూలర్ సిబ్బంది ఖాళీ:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో పరిపాలన పరిస్థితి పరిశీలిస్తే అర్హత కల్గిన అధికారులు ఎలాంటి అధికారాల్లేకుండా ఫైళ్ళను చూడకుండా నెలకు రూ.1.2లక్షలు జీతాలు తీసుకుంటూ ఉన్నారు.కానీ ఇక్కడ కొందరు అవుట్ సోర్సింగ్ సిబ్బంది పెత్తనం చెలాయిస్తున్నారంటే పాలన తీరు అర్థమౌతుంది.పచ్చదనాన్ని కాపాడాల్సిన ఉద్యోగులు తమ ఆదాయాల కోసం అధికార పార్టీ నాయకుల సిఫార్సుల మేరకు ఆలయంలో పని చేస్తున్నారు. ఆదాయాలు వచ్చే రాహుకేతుదోష నివారణ మండపాల్లో విధులు వేసుకుంటున్నారు. రెగ్యూలర్ సిబ్బంది కనీసం గేట్ల వద్ద కూడా పనికి రారు అన్నట్లు మౌనంగా ఉన్నారు.

**ఫైల్ వస్తే సంతకం పెట్టాలి:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో గతంలో పారదర్శకతకు మారు పేరుగా ఉండేది. అయితే నేడు నిబంధనలు గాలికి పోయాయి. ఏ బిల్లు అయినా సీటుమీదకు వస్తే ఏమీ పరిశీలించకుండా సంతకాలు చేసే ఉద్యోగి కావాలి? నిబంధనలు పాటించే వారు అవసరం లేదన్నట్లు పరిస్థితి మారింది. కొందరు ఉన్నతాధికారులకు ఎలాంటి పని లేకుండా జీతాలు తీసుకుంటే అధికారులు చెల్లిస్తున్నారంటే ఇది ఏమి పరిపాలన అని చూపరులు ముక్కున వేలేసుకుంటున్నారు.ఇప్పటికైనా పరిపాలనలో పారదర్శకతకు అవకాశం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరి ముక్కంటీశుడు ఎప్పటికి తమ పరిపాలనను సరిదిద్దుకుంటారో ఏమో ?

## అటా మహాసభలకు ద్రావిడ అధ్యాపకులకు ఆహ్వానం

కుప్పం, జూన్ 1,ప్రభాతవార్త:



అమెరికా దేశంలోని అట్లాంట నగరంలో జరగనున్న అమెరిక తెలుగు అసోషియోషన్ 18వ మహాసభలకు ద్రావిడ యూనివర్సిటీ అధ్యపకులుగా పని చేస్తున్న తెలుగు శాఖ విభాగంలో సహాయ అధ్యాపకులుగా పని చేస్తున్న డా.పళణి,ప్రచురణ విభాగం మాజీ అధ్యక్షురాలు డా.ఉదయకుమారిలను అతిధులుగా ఆహ్వానిస్తు ఆటా కన్వీనర్ కిరణ్‌రెడ్డి పాశ్యం ఆహ్వాన పత్రాలు పంపారు.ఈ నెల 7 నుండి 9 వరకు ఆట్లాంట నగరంలోని జార్జియా వరల్డ్ కన్ఫరెన్స్ సెంటర్‌లో జరిగే మహాసభలలో డా.పళణి,డా.ఉదయకుమారిలు తెలుగు సంస్కృతిపై తమ ప్రసంగాలను వినిపించనున్నారు.ఇద్దరు అధ్యాపకులకు అటా మహా సభలకు ఆహ్వానం రావడంతో ద్రావిడ యూనివర్సిటి వీసి ఆచార్య మధుజ్యోతి,రెక్టార్ ఆచార్య అనురాధా,రిజిష్టర్ డా.వేణుగోపాల రెడ్డి,అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

## 30వ తేదీ వరకు కుప్పం డివిజన్‌లో 30పోలీస్ యాక్ట్ అమలు

-డిఎస్పీ బండారు శ్రీనాథ్

కుప్పం,జూన్ 1,ప్రభాతవార్త:

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు కుప్పం పోలీసు సబ్ డివిజన్ పరిధిలో జూన్ 30 వరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని డిఎస్పీ బండారు శ్రీనాథ్ తెలిపారు.ముందస్తు అనుమతులు లేకుండా సభలు,సమావేశాలు,ఉరేగింపులు నిర్వహించరాదని,సభలు సమావేశాల నిర్వహించాలంటే పోలీసు శాఖ ముందస్తు అనుమతులు తప్పని సరని తెలిపారు.శాంతిభద్రతల పరిరక్షణ కోసం రాజకీయ పక్షాలు,ప్రజలు సహకరించాలని సూచించారు.ఎన్నికల కౌంటింగ్ రోజు ఎవరైన అల్లర్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని వారిపై కేసును నమోదు చేస్తామని హెచ్చరించారు.

## మంత్రి పెద్దిరెడ్డిని కలసిన గంగమ్మ ఆలయ చైర్మన్ మంజునాథ్‌కుమార్

కుప్పం రూరల్,జూన్ 1,ప్రభాతవార్త:



రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని శనివారం కుప్పం శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయ చైర్మన్ కే.ఏ.మంజునాథ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డికి చైర్మన్ మంజునాథ్ తిరుపతి శ్రీ గంగమ్మ అమ్మవారి వస్త్రాలు,ప్రసాదాలను అందజేశారు.ప్రశాంత వాతావరణంలో అమ్మవారి జాతరను విజయవంతంగా దేవాదాయ శాఖ సహకారంతో నిర్వహించిన ఆలయ చైర్మన్ మంజునాథ్ కుమార్‌ను మంత్రి పెద్దిరెడ్డి అభినందించారు.ఎ.జీ.లక్ష్మీపతి పాల్గొన్నారు.

## ఎన్.కొత్తపల్లెలో ఘర్షణలు -పోలీసులకు వరుస ఫిర్యాదు

కుప్పం రూరల్,జూన్ 1,ప్రభాతవార్త:

మండలంలోని ఎన్.కొత్తపల్లె గ్రామంలో వరుస ఘర్షణలు జరిగి ఒకరిపై మరొకరు పోలీసులకు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. స్థానికుల సమాచారం మేరకు... గ్రామానికి చెందిన ఓ వివాహిత పట్ల జయశంకర్ అనుచితంగా వ్యవహరించడంతో ఆ వివాహిత భర్త, బంధవులు జయశంకర్‌పై దాడి చేశారు. ఈ సంఘటనపై జయశంకర్ రాజకీయ కారణాలతోనే వైకాపా నాయకులు దాడులు చేశారని మాజీ సర్పంచ్ నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు.కాగా జయశంకర్ తనపట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆ వివాహిత సైతం పోలీసులకు ఫిర్యాదు చేసింది.గ్రామానికి చెందిన సుబ్రమణ్యం మద్యం మత్తులో దుర్భాషలాడడంతో అతనిపై ఈశ్వర్ కుటుబసభ్యులు దాడి చేసినట్లు సుబ్రమణ్యం కుటుంబసభ్యుల ఫిర్యాదు చేశారు. కొత్తపల్లె గ్రామంలో ప్రజలు వరుస ఫిర్యాదులతో గ్రామంలో కొంత పాటి అలజడులు చలరేగుతున్నాయి.

## ఘనంగా హనుమ జన్మదినం

పుంగనూరు, జూన్ 1 ప్రభాతవార్త:



హనుమజ్జయంతిని పుంగనూరులో శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణ సరిహద్దులలోని శ్రీహనుమంతరాయదిన్నె గ్రామంలోని శ్రీప్రసన్నాంజనేయస్వామివారి ఆలయం ఉదయం నుంచి స్వామిమూర్తికి ఘనంగా అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయం వద్ద భక్తులకు పెద్దఎత్తున తీర్థప్రసాదాలు అందచేశారు. పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వరాలయ ఆవరణలో వెలసిన శ్రీప్రసన్న ఆంజనేయస్వామివారి ఆలయంలో మూర్తికి అభిషేకాలు నిర్వహించి,తమలపాలకు మాలలతో అలంకరించారు. ఇదే విధంగా బ్రాహ్మణవీధిలోని ఆంజనేయస్వామివారి ఆలయంతో పాటూ పలు ప్రాంతాలలో హనుమ ఆలయాలలో జన్మదిన వేడుకలు నిర్వహించారు.

## మకరతోరణం ఛత్రము బహూకరణ

చౌడేపల్లి, జూన్ 1 ప్రభాతవార్త



స్థానిక కమలాంజనేయస్వామికి మకరతోరణము, ఛత్రములను బహూకరించారు. హనుమజ్జయంతి సందర్భంగా చౌడేపల్లికి చెందిన పిల్లారి ఏజెన్సీస్ అధినేత పిల్లారి జీవన్ ప్రకాష్ రూ. 25వేలు విలువ చేయు ఛత్రము, పుంగనూరు కమలాకర్ రూ. 60వేలు విలువ గల మకరతోరణాన్ని బహూకరించారు. దాతలను ప్రధానార్చకుడు వశిష్టాచార్యులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికి స్వామివారి దర్శనానంతరం పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## మద్యం సేవించి కౌంటింగ్‌కు రావద్దు : ఎస్ఐ

చౌడేపల్లి, జూన్ 1 ప్రభాతవార్త

మద్యం సేవించి ఎన్నికల కౌంటింగ్‌కు రావద్దని ఎస్ఐ ప్రతాపరెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఈనెల 4న చిత్తూరు నందు ఎన్నికల కౌంటింగ్ ఉంటుందనీ, కౌంటింగ్ ఏజెట్లు మద్యం సేవించి రాకూడదన్నారు. కేంద్రం వద్ద ఎన్నడూ లేని విధంగా బ్రీతింగ్ ఎనలైజర్‌తో తనిఖీలు నిర్వహిస్తారని మద్యం సేవించినట్లు రుజువైతే బయటకు పంపేయడం జరుగుతుందన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

కాణిపాకం, జూన్ 1 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు శనివారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు తిరుపతికి చెందిన నాగేశ్వరవర్మ అనే భక్తుడు నిత్యాన్నదాన పథకంకు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొతా _న్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్‌లకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో ఘనంగా శ్రీహనుమాన్ జయంతి వేడుకలు

తవణంపల్లె, జూన్ 1 ప్రభాతవార్త:

శ్రీహనుమాన్ జయంతి వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో శనివారం అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని అరగొండ రెడ్డిపల్లెమిట్ట వద్ద వెలసిన శ్రీఅభయ అంజనేయస్వామి ఆలయంలో వంశపారంపర్యం ధర్మకర్త సుందరవేలు ఆధ్వర్యంలో శ్రీహనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం, ఉచిత తీర్థ ప్రసాదాలను అందజేశారు. అలాగే అరగొండ శ్రీకోదండరామస్వామి దేవస్థానం, మత్యం శ్రీఅభయాంజనేయ ఆలయం, సరకల్లు ఆంజనేయస్వామి ఆలయం, గాజులపల్లె, జి.గొల్లపల్లెలలోని ఆంజనేయ విగ్రహాల వద్ద, పలు గ్రామాల్లోని రామాలయాలు, భజన మందిరాలలో శ్రీహనుమాన్ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలు, పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, ఊరేగింపులు నిర్వహించారు. అలాగే అన్నదాన కార్యక్రమాలతో పాటు రామకోటి తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

## పిల్లలకు నాణ్యమైన పోషకాహారం అందించాలి

తవణంపల్లె, జూన్ 1 ప్రభాతవార్త:



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని ఎంఈఓ త్యాగ రాజులురెడ్డి అన్నారు. శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని తెలిపారు. అలాగే ఈ విద్యా సంవత్సరానికి విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం సిద్ధం చేయాలన్నారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజనం తయారీపై రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన రీసోర్స్‌పర్సన్ అములుచే శిక్షణనిచ్చారు. ఈసందర్భంగా వంటకాలపై వంట కార్మికులకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో మండలంలోని మధ్యాహ్న కార్మికులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## భక్తి శ్రద్ధలతో హనుమజ్జయంతి వేడుకలు

సదుం, జూన్ 1 ప్రభాతవార్త



మండలంలో పలు చోట్ల శనివారం హనుమజ్జయంతి వేడుకలు భకి శ్రద్దలతో నిర్వహించారు. తాటిగుంటపాలెం,బూరగమంద, నడిగడ్డ మతుకువారిపల్లె,బట్టువారిపల్లె,బందార్లవారిపల్లె మలుపు,సదుం కాలేజి రోడ్డు,బూరగమంద మలుపు,సీతమ్మగుట్ట మారుతి ఆశ్రమంలతో పాటు గార్గేయనది ఒడ్డున ఉన్న ఆంజనేయస్వామి వారి ఆలయాలలో ఉదయం నంచి ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. తొలుత స్వామి వారికి 101 బిందెల నీటితో అభిషేకించారు. అనంతరం పలురకాల సుగంధద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం తమలపాకులతో ఆకు పూజ నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారికి నైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం గ్రామాల్లో ఆంజనేయస్వామి వారి విగ్రహాలను ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

## తాటిగుంటపాలెంలో మలేరియా మాసోత్సవం

సదుం, జూన్ 1 ప్రభాతవార్త



మండల పరిదిలోని తాటిగుంటపాలెం గ్రామంలో శనివారం చెరకువారిపల్లె పిహెచ్‌సీ ఆధ్వర్యంలో మలేరియా మాసోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రజలకు వివరించారు. ఆరోగ య పర్యవేక్షణ సిబ్బంది నీలకంఠ మాట్లాడుతూ జూన్ నెల1 నుంచి 30 వరకు మలేరియా మాసోత్సవం జరుపుతామన్నారు. వర్షాకాలం మొదలు అవుతున్నది కావున దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమ కాటు వల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యావంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. జ్వరం వచ్చిన వెంటనే డాక్టరు వద్దకు వెళ్లి పరీక్ష జరుపుకుని ఏజ్వరం అని నిర్ధారణ అయిన వెంటనే తగిన చికిత్స తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రషీద్, పబ్లిక్ హెల్త్ నర్సు జానకి, ఆరోగ్య కార్యకర్త సత్తాజ్,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## యర్రావారిపాలెంలో ప్రపంచ పాల దినోత్సవం

యర్రావారిపాలెం, జూన్ 1 ప్రభాతవార్త




మండల పరిధిలోని రెడ్డివారిపల్లె బీఎంసీలో శ్రీజ డైరీ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ పాల దినోత్సవాన్ని నిర్వహించారు. ఏటా ప్రపంచ వ్యాప్తంగా పాల ఉత్పత్తులు వాటి ప్రయోజనాలు గురించి ప్రచారం చేయడమే దీని లక్ష్యం ఏరియా ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎందరిలో జీవనోపాధి పొందేలా చేయడమే లక్ష్యంగా మిల్క్‌డేని ప్రతి సంవత్సరం జూన్1న నిర్వహిస్తామని చెప్పారు. దీని వల్ల పాడి పరిశ్రమ అబివృద్ధి చెంది ఎందరికో జీవనోపాధి పొందేలా చేయడమేనన్నారు. కార్యక్రమంలో పిఐబీ ఎగ్జిక్యూటివ్ కేశవ, సిబ్బంది చిరంజీవి, ప్రసాద్, నాగరాజ,వెంకటేశ్, దిలీప్‌కుమార్, కేశవ,రెడ్డివారిపల్లె పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

## బిఎస్ఎన్ఎల్ 4జి పనులు ప్రారంభం

బోయకొండ(చౌడేపల్లి), జూన్ 1 ప్రభాతవార్త



శక్తిక్షేత్రం బోయకొండపై బిఎస్ఎన్ఎల్ సేవలను విస్తరింపజేయడానికి పనులు ప్రారంభించారు. కొండపై జరుగుతున్న పనులను శనివారం తిరుపతి సిజిఎం కార్యాలయ ఎస్‌డిఇ మోహన్ పరిశీలించారు. పనులు పూర్తయితే యాత్రీకులకు నిరంతర సేవలు అందుబాటులోకి రానున్నాయి. అదే విధంగా దేవస్థానంలోనూ వివిధ రకాల సేవా టిక్కెట్ల జారీ విషయంలో ఇంటర్‌నెట్ ఇబ్బందులుండవు. ఆలయ ఛేర్మన్ నాగరాజరెడ్డి, ఇఓ చంద్రమౌళిలు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## గూడూరులో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

గూడూరు, జూన్ 1, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తూర్పు వీధి ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద తమలపాకుల పూజ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా కరణాల వీధిలోని శ్రీ చెన్నకేశవ స్వామి వారి దేవస్థానంలో హనుమాన్ జయంతి సందర్భంగా సామూహిక తమలపాకు సేవ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో సామూహిక తమలపాకు సేవా కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. హనుమ జయంతి సందర్భంగా గూడూరు పట్టణంలో శ్రీ రామరక్ష కుటీరము నందు 54వ హనుమ జయంతోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆంజనేయ స్వామి వారికి విశేషాలంకరణ అష్టోత్తర శత సహస్ర నాగవల్లి దళ తమలపాకుల సామూహిక అర్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అదే విధంగా పట్టణంలోని తమ్మిశెట్టి గుంట, జాంద్ర వీధి, ఆర్టీసి వద్ద ఉన్న పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

గూడూరు, జూన్ 1, ప్రభాతవార్త



గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని నెల్లటూరు గ్రామ సమీపంలోని నిర్జీవ ప్రదేశంలో సుమారు 50 సంవత్సరాల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించామని రూరల్ పోలీస్‌లు తెలిపారు. మృతుని శరీరంపై గాయాలు ఉండడం, శరీరంపై బులుగు రంగు నిక్కరు మాత్రమే ఉందని, మృతిని వద్ద ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వివరాలు తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని కోరారు.

## అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు

సిఐ సంగమేశ్వర రావు

వెంకటగిరి టౌన్, జూన్ 1, ప్రభాతవార్త



ఎన్నికల కోడ్ ఉన్నందువల్ల 144 సెక్షన్ అమల్లో ఉందని వెంకటగిరి సిఐ సంగమేశ్వర రావు తెలిపారు. ఆయన సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సభలు, సమావేశాలు నిర్వహించరాదని, బాణాసంచా కాల్చరాదని తెలిపారు. ర్యాలీలు కూడా నిర్వహించరాదని చెప్పారు. కౌంటింగ్ రోజు అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నిబంధన ఉల్లగించే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. 24 గంటలు నిఘ ఉందని తెలిపారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

వెంకటగిరి టౌన్, జూన్ 1, ప్రభాతవార్త



పట్టణం, గ్రామాల్లో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలను ప్రజలు నిర్వహించారు. పాతకోట వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో అభిషేకాలు నిర్వహించి పూజలు జరిపారు. ఆంజనేయ స్వామి విగ్రహానికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

కోట, జూన్ 1 ప్రభాతవార్త

కోట మండలంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆంజనేయస్వామి ఆలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోటలోని ఆంజనేయస్వామి ఆలయంలో 108 సార్లు హనుమాన్ చాలిసా పారాయణం నిర్వహించారు. విద్యానగర్, గూడలి తదితర గ్రామాల్లో అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## తడ నూతన ఎంపిడిఓగా మురళీకృష్ణ

తడ, జూన్ 1 ప్రభాతవార్త



తడ మండల అభివృద్ధి అధికారిగా మురళీకృష్ణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు పనిచేస్తున్న ఎంపిడిఓగా ఉన్న ఆమోస్‌బాబు శుక్రవారం పదవీ విరమణ చేశారు దీంతో తడ ఎంపీడీఓగా ఏవీ మురళీకృష్ణను పూర్తి అదనపు బాధ్యతలు ఇస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం బాధ్యతలు చేపట్టారు.

## తడ ఆలయాల్లో హనుమజ్జయంతి

తడ, జూన్ 1 ప్రభాతవార్త

తడ మండలంలోని వివిధ వైష్ణవ ఆలయాల్లో శనివారం హనుమజ్జయంతి వేడుకలు సందర్భంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తమిళనాడు సరిహద్దుల్లోని పన్నంగాడు వద్ద శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో రెండు రాష్ట్రాల భక్తులు పూజలు చేశారు. అక్కడి ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. తడలోని సీతారామాంజనేయస్వామి ఆలయంతో పాటు పల్లెపాలెంలోని హనుమంతుని విగ్రహం వద్ద కూడా శనివారం వేడుకలు నిర్వహించారు.

## వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పోటీలు

సూళ్లూరుపేట, జూన్ 1 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని వాసవీ క్లబ్, విశ్వహిందూ పరిషత్ వారి ఆధ్వర్యంలో 16 సంవత్సరాల లోపు గల పిల్లలకు హనుమజ్జయంతిని పురస్కరించుకొని శనివారం హనుమాన్ చాలీసా పారాయణం పోటీలు నిర్వహించారు. స్థానిక సత్యసాయి మందిరంలో నిర్వహించిన ఈ పోటీలలో 50 మంది విద్యార్థులు పాల్గొని హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. వీరిలో విజేతలకు ఆదివారం బహుమతి ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండారు శబరీష్ గుప్తా, సాయిరాం, సునీత, శ్యాంసుందర్, దుర్గి రమేష్, ఆర్.సుబ్రహ్మణ్యం, పద్మజ, కళావతి, శైలజ, విశ్వహిందూ పరిషత్‌కు చెందిన కృష్ణారెడ్డి, సన్యాసిరావు, ప్రతిమ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా హనుమజ్జయంతి ఉత్సవాలు

వాకాడు, జూన్ 1, ప్రభాతవార్త



వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం గ్రామంలోని శ్రీ పట్టాభి రామాలయంలో హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవ, ప్రాత: కాల ఆరాధనలతో ప్రారంభమైన పూజా కార్యక్రమాలు శ్రీ హనుమత్, లక్ష్మణ, సీతా సమేత పట్టాభిరామచంద్ర స్వామి వారికి చతుర్దశ కలశ స్నపనలు, ఆంజనేయ స్వామి వారికి సహస్ర నాగవల్లి దళార్చన, విశేష పూజలు, ద్వాదశ ఆరాధన, ద్వాదశ ప్రదక్షిణలు కార్యక్రమాలకు ఉభయకర్తలుగా పుట్టం వెంకటేశ్వర్లు రెడ్డి, అనురాధ దంపతులు వ్యవహరించారు. ఆలయ ప్రధాన అర్చకులు దీవి అనంతాచార్యులు పూజాధికాలు జరిపించారు. విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో వాకాడు సొసైటీ చైర్మన్ కొడవలూరు దామోదర రెడ్డి, శ్రీ రామసేన అధ్యక్ష కార్యదర్శులు కొడవలూరు హరీష్ రెడ్డి, శివకుమార్, గురుప్రసాద్, మోహన్, రాజేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపిడిఓ

వాకాడు, జూన్ 1, ప్రభాతవార్త



మండల పరిధిలోని వృద్ధులకు పింఛన్లు, దివ్యాంగులకు ఎంపిడిఓ వెంకటేశ్వర రావు సిబ్బంది చేత పంపిణీ చేయించారు. మండలంలోని 19 పంచాయితీలలో ఎంపిడిఓ వెంకటేశ్వర రావు ఆయా పంచాయితీ కార్యదర్శులుతో ఇవ్వాల్సిన పింఛను పంపిణీ చేశారు. పంచాయితీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి, ప్రతి ఒక్కరికి ఇవ్వాల్సిన పింఛన్ ప్రతి ఒక్కరికి అందజేయాలని కోరారు.

## మజ్జిగ ప్యాకెట్లు వితరణ

గూడూరు, జూన్ 1, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని కోర్ట్ సెంటర్ వద్ద ఉన్న ప్రయాణికుల షెల్టర్ నందు గూడూరు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా సిఐలు రవికిరణ్, వేణుగోపాల్ రెడ్డిలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ బ్రాహ్మణ సేవా సంఘం గూడూరు వారు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలకు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షుడు అని మెళ్ళ శివకుమార్, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, కోశాధికారి లలితమ్మ, శ్రీనివాస రావు, నరసింహాన్, కడివేటి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబానికి ఆర్థిక సాయం

వెంకటగిరి టౌన్, జూన్ 1, ప్రభాతవార్త



తోలుమెట్టుకు చెందిన రమేష్ మృతి చెందడంతో కాపు బలిజ సంక్షేమ సంఘం వారు ఆర్థిక సహాయాన్ని అందజేసారు. మేము అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇచ్చారు. రామిశెట్టి సురేష్ అనే పేద ఎలక్ట్రీషన్ వడదెబ్బకు మే నెల 30వ తేది మరణించిన విషయం తెలుసుకున్న వవెంకటగిరి శ్రీ కృష్ణ దేవరాయ బలిజ ట్రస్ట్ సభ్యులు తోటకృష్ణయ్య, కందాల తిరుపాలు, పసుపులేటి తులసి, కోనా సాయి సుంకర రవికుమార్ చేయూత ఫౌండేషన్ - నెల్లూరు వారి సహకారంతో కలిపి 7000 రూపాయిలు నగదు సహాయంగా వారి కుటుంబ సభ్యులకు అందజేసారు.

## ఘనంగా హనుమాన్ జయంతి..శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం.

పెద్దపంజాణి జూన్1 ప్రభాతవార్త :



మండలంలోని దిన్నిపల్లి సమీపంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగానిర్వహించారు.ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేకఅలంకరణలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ సీతారాములవారి కాళ్యాణాన్ని కన్నులపండుగగా నిర్వహించారు. వేదపండితులమంత్రోచ్చారణమధ్య శ్రీ సీతారాములు అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగాఅలంకరించి సంప్రదాయరీతిలో కళ్యాణమహోత్సవాన్ని అశేషభక్తులమధ్య వేదపండితులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంవద్ద భక్తులకాలక్షేపంకోసం శ్రీరామకోటిజపాన్ని ఏర్పాటుచేశారు.రాత్రి ఆలయంవద్ద భక్తుల కోలాటలు,చెక్కభజన కార్యక్రమాలను నిర్వహించారు.అలాగే మండలంలోని కెలవాతి గ్రామంలో సైతం హనుమాన్ జయంతిని నిర్వహించారు. మాజీమంత్రి అమర్నాథ్ రెడ్డి, ఆయన సతీమణి రేణుకారెడ్డి తదితరలు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## బోర్ మోటార్ కేబుల్ చోరీ

పాకాల, జూన్ 1, ప్రభాతవార్త



పాకాల మండలంలోని సామిరెడ్డిపల్లి పంచాయితీ కోనపురెడ్డిపల్లికి చెందిన రైతు ద్వారకా బాబు పొలంలో శుక్రవారం రాత్రి దొంగలు పడి కేబుల్ వైరు కత్తిరించుకుని వెళ్లారు. తోటపల్లి సమీపంలోని పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారి ఆనుకుని ఉన్న రైతు పొలంలోకి చొరపడిన దొంగలు బోరు వద్ద గల స్టార్టర్ బాక్సును పగలగొట్టి ఫీజు క్యారియర్లను ధ్వంసం చేసి సుమారు 20 మీటర్ల కేబుల్‌ను కత్తించుకుని వెళ్లారు. అక్కడే ఉన్న సింటెక్స్ వాటర్ ట్యాంక్‌తో పాటు పైపులకు నిప్పు పెట్టి నష్టం కలిగించినట్లు ఆ రైతు వాపోయారు. గతంలోను ఇదే విధంగా అనేక సార్లు చోరీ జరిగినట్లు రైతు తెలిపారు. ఈ మేరకు రైతు ద్వారాకబాబు పాకాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## నింబజాదేవి ఆలయంలో ప్రత్యేకపూజలు

శ్రీకాళహస్తి, జూన్ 1 ప్రభాతవార్త



పట్టణంలోని జెట్టిపాళెంలో వెలసిన నింబజాదేవి ఆలయంలో వెలసిన ఆంజనేయ స్వామి విగ్రహానికి హనుమాన్ జయంతి సందర్భంగా అర్చకులు మురళీశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి విశేషపూజలు అభిషేకాలు నిర్వహించి చక్కగా అలంకరణ నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారికి తమలపాకులహారం, వడమాలతో అలకరించి పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. విచ్చేసిన భక్తులకు ఆలయం తరపున ప్రసాదాలు నిర్వహించారు.

## స్వర్గీయ నీలం సంజీవరెడ్డి సేవలు చిరస్మరణీయం

ఆచార్య శ్రీకాంత్ రెడ్డి

తిరుపతి క్రీడ, జూన్ 1, ప్రభాతవార్త



భారత 6వ రాష్ట్రపతిగా పనిచేసిన స్వర్గీయ నీలం సంజీవ రెడ్డి 27 వర్ధంతిని పురస్కరించుకుని ఎస్వీయూలోని వారి నిలువెత్తు విగ్రహానికి పూలమాలవేసి ఎస్వీయూ అధికారులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య వి. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ 1954లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ స్థాపనలో సంజీవరెడ్డి కృషి ఎంతో వుందని, వారికి విశ్వవిద్యాలయం ఎప్పటికీ రుణపడి వుంటుందని తెలిపారు. వారికి ఎస్వీయూ 1958లో గౌరవ డాక్టరేట్ ఇచ్చిందని గుర్తు చేశారు. వారు మన మధ్య లేకపోయినా, వారి వారి దీర్ఘదృష్టి వల్ల వేల మంది విద్యార్థులు చదువుకుని గొప్ప స్థానాల్లో వున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్, మీడియా కోఆర్డినేటర్ ఆచార్య విసి వెంకటేశ్వర్లు, ఇంజనీర్ తాండవ కృష్ణ, ఇంజనీర్ సిబ్బంది, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

## జై హనుమాన్,జైజై హనుమాన్

శ్రీకాళహస్తిలో విశేష పూజలు

శ్రీకాళహస్తి,మే 1 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని వాడ వాడల్లో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని స్వామి గర్భగుడికి వెళ్లు వాకిళ్ళ మెట్ల వద్ద వెలసిన ఆంజనేయ స్వామి విగ్రహానికి వడమాల, తమలపాకుల మాలలతో ముస్తాబు చేసారు. కాగా ఆలయంలోని 16కాళ్ళ మండపంలోవెలసిన హనుమాన్ విగ్రహం వద్ద అర్చకులు తులసీ సారధ్యంలో భారీ ఎత్తున పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో ఆలయ ఇఒ ఎస్వి నాగేశ్వరరావు,ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు. ృహనుమాన్ ఆలయం వద్ద హోమాలు ఏర్పాటు చేసారు. కలశ స్థాపన గావించారు.వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా మారుతీశర్మ వేదమంత్రాలతో తులసీ శర్మ పూజలు నిర్వహించారు.కాగా ముత్యాలమ్మగుడివీధిలోని అభయ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అంగరంగ వైభవంగా కార్యక్రమాలు ఏర్పాటు చేసారు.కాగా బంగారమ్మ ఆలయం వద్ద స్వామికి భారీ ఎత్తున పూజలు నిర్వహించారు.ఇక్కడ చుట్టుపక్కల వాడలకు చెందిన భక్తులు భారీ ఎత్తున హాజరయ్యారు.ఏర్పాట్లును ఆలయ సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్, వేదపండితులు మారుతీశర్మ, అర్చకులు తులసీశర్మ దేవస్థానం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

**ఊరేగింపు:** హనుమజ్జయంతి సందర్భంగా శనివారం రాత్రి హనుమాన్ చిత్రపటాన్ని ఊరేగించారు. ఊరేగింపు పట్టణ ప్రధాన వీధుల్లో సాగింది. భక్తులు విశేష హారతులందించారు.

## ఆశ్రిత చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్ ప్రారంభం

తిరుపతి హెల్త్, జూన్ 1, ప్రభాతవార్త



తిరుపతిలోని మొట్టమొదటిసారిగా మానసిక వైద్య నిపుణులచే ఎదుగుదల లోపం ఉన్న పిల్లల కోసం స్వచ్ఛందంగా సేవలు అందించడానికి ఆశ్రిత చిల్డ్రన్ డెవలప్మెంట్ సెంటర్‌ను డాక్టర్ కవిత, డాక్టర్ భారతిచే స్థాపించబడింది. శనివారం ఉదయం అబ్బన్నకాలనీ లో తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష ప్రారంభించి ఈ సంస్థ సేవల గురించి వివరించారు. చిన్న పిల్లల్లోని అన్ని మానసిక రుగ్మతలకు వైద్యం అందించబడుతుందని, తల్లిదండ్రులకు అవగాహన కల్పించబడుతుందన్నారు. పిల్లల మానసిక రుగ్మతలకు ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన వైద్యం అందించిన ఎడల వారి బాల్యాన్ని వారికి తిరిగి అందించలుగుతామన్నారు. అందుకోసం నిపుణుల పర్యవేక్షణలో స్పీచ్ థెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, స్పెషల్ ఎడ్యుకేషనల్ సేవలు అందించబడును తుందని పేర్కొన్నారు.డాక్టర్ కిషోర్, డాక్టర్ మల్లికార్జున రావు, ఇతర ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.

## ఘనంగా కళ్యాణ వేంకటేశ్వరుని ఊంజలసేవ

నారాయణవనం, జూన్ 1 ప్రభాతవార్త :



నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. అంతకు ముందు అమ్మవారిని, స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, శుద్ధి, పుణ్యవచనం, గంట, అర్చన, బలి, తోమాలసేవ, నిత్యకైంకర్య పూజ కార్యక్రమాల అనంతరం పాలు, పెరుగు, నెయ్యి వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అధిరోహించి ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని టెంకాయ హారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నెయ్యి దీపాలను వెలిగించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు. ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ భరత్, సిబ్బంది కైలాసం, సాంబయ్య, మోహన్, మూర్తి, మురళి, అర్చకులు పాల్గొన్నారు.

## సముదాయం వీధుల్లో ట్రాక్టర్‌పై ఊరేగిన నైనాతమ్మ అమ్మవారు

వాహనాలపై శరీరానికి ముళ్ళు గుచ్చుకొని విన్యాసాలు

నారాయణవనం, జూన్ 1 ప్రభాతవార్త :



మండలంలోని సముదాయం గ్రామానికి చెందిన అగుముడి కులస్తుల కులదైవం నైనాతమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవరోజు శనివారం రాత్రి అమ్మవారిని ట్రాక్టర్‌పై అధిరోహించి గ్రామవీధుల్లో ఘనంగా ఊరేగించారు. అంతకుముందు ఉదయం స్వామి,అమ్మవారికి అభిషేకం చేసిన తర్వాత పుష్పాలతో సుమనోహరంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి ట్రాక్టర్‌పై అధిరోహించి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బాణసంచాపేలుళ్ల నడుమ ఘనంగా ఊరేగించారు. భక్తులు అడుగడుగునా టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. అంతకుముందు కంకణం ధరించిన యువత భక్తులు వాహనాలపై శరీరానికి ముళ్ళు గుచ్చుకొని విన్యాసం చేశారు. ఈ ఉత్సవాలను అగుముడి కులస్తులు గత ఎనిమిది సంవత్సరాలుగా జరుపుకుంటున్నారు.

## ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు..!

చంద్రగిరి, జూన్ 1 ప్రభాతవార్త:



కౌంటింగ్ సమీపిస్తున్న వేళ ఎవరైనా ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ రామయ్య హెచ్చరించారు. మండల పరిధిలోని పనపాకం (అరిగెలవారిపల్లి), ఎం.కొంగరవారిపల్లి, ఐతేపల్లి, అగరాల పంచాయతీలలో శనివారం శాంతిభద్రతల కొరకు పోలీసులు చేపట్టిన ముందస్తు జాగ్రత్తలను వివరిస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తం పోలింగ్ రోజున చోటుచేసుకున్న పరిణామాలను ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించినట్లు తెలిపారు. దీంతో కౌంటింగ్ రోజున ఎటువంటి అల్లర్లు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని కోరారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, దాడులకు పాల్పడటం, ర్యాలీలలో పాల్గొనడం, విజయోత్సవ సంబరాలు జరుపుకోవడం నిషేధమన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డిఎస్పీ రవికుమార్, ట్రైనీ ఐపిఎస్ పాటిల్ దేవరాజ్, గ్రేహౌండ్ అసిస్టెంట్ కమాండెంట్ రాజశేఖర్, ఎస్ఐ అనిత, ప్రత్యేక బలగాలు పాల్గొన్నారు.

## వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు

శ్రీరామ భక్తుడికి విశేష అలంకరణలతో పూజలు

చంద్రగిరి, జూన్ 1 ప్రభాతవార్త:



మండల వ్యాప్తంగా గల శ్రీఆంజనేయస్వామి వారి ఆలయలలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీవారిమెట్టు మార్గంలో గల అభయాంజనేయ స్వామి వారి ఆలయంలో మూలవిరాట్‌ను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణలతో విశేష అలంకరన గావించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా తొండవాడ వద్ద గల శ్రీఉగ్రప్రత్యంగిరాపీఠంలో వెలసియున్న శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారికి హనుమాన్ జయంతిని పురస్కరించుకుని 1116 లీటర్ల పాలతో అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో శ్రీరామ భక్తుడి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా చంద్రగిరి, కోట గ్రామంలో వెలసియున్న ఆంజనేయస్వామి వారి ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి, భక్తులకు దర్శన సౌకర్యం కల్పించారు.

## అన్నివిధాలా అండగా "జనసేన లీగల్ సెల్"

జనసేన చంద్రగిరి ఇన్‌చార్జ్ దేవర మనోహర్‌కు నాదెండ్ల మనోహర్ హామీ

చంద్రగిరి, జూన్ 1 ప్రభాతవార్త:



ఎన్నికల సమయంలో అధికార పార్టీ దౌర్జన్యాలు, అక్రమ కేసులపై జనసేన లీగల్ సెల్ అన్నివిధాలుగా మీకు అండగా నిలుస్తుందని తెనాలి జనసేన ఎంఎల్ఏ అభ్యర్థి, పిఏసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ స్పష్టమైన హామీ ఇచ్చినట్లు చంద్రగిరి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ దేవర మనోహర తెలిపారు. మరో మూడు రోజుల్లో ఎన్నికల ఫలితాలు వెళ్ళడి కానునన్న నేపథ్యంలో శనివారం ఆయన మర్యాదపూర్వకంగా నాదెండ్లను కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలను కూలంకషంగా వివరించినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన ఆయన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. ముక్యంగా కౌంటింగ్ సమయంలో మరింత అప్రమత్తంగా వుండాలన్నారు.

## వానర వనంలో హనుమాన్ జయంతి వేడుకలు

రామచంద్రాపురం, జూన్ 1 ప్రభాతవార్త:



నెత్తకుప్పం సమీపంలోని వానర వనంలో శనివారం హనుమాన్ జయంత్రి వేడుకలను భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా జరుపుకున్నారు. ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ ఆధ్వర్యంలో ఉదయం వివిధ రకాల సుగంధ పరిమళ ద్రవ్యాలతో వినాయక స్వామి వారికి, దక్షిణామూర్తి స్వామి వారికి, ప్రసన్నాంజనేయ స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి తమలపాకుల హారం, వడల హారంతో పాటు వివిధ రకాల సుగంధభరిత పుష్పాలతో అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

## 12 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

తిరుపతి విద్య, జూన్ 1, ప్రభాతవార్త

ఎస్వీయూ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 12 వ తేది నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దామ్లానాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా డిగ్రీ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్, సెకండ్ ఇయర్ నాలుగవ సెమిస్టర్ పరీక్షలను 12వ తేది నుంచి జూలై 2వ తేది వరకు జరుగుతాయని పేర్కొన్నారు. అన్ని డిగ్రీ కళాశాలల్లో ఒక్కో సెమిస్టర్‌కు సుమారు 22 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. పరీక్షల షెడ్యూల్‌ను ఇప్పటికే అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లకు పంపించామని తెలిపారు. గతంలో నిర్దేశించిన పరీక్షా కేంద్రాల్లోనే పరీక్షలు జరుగుతాయని, ఇందులో మార్పులేదని పేర్కొన్నారు.

## బండారుపల్లిలో హనుమ జయంతి వేడుకలు

ఏర్పేడు, జూన్1, ప్రభాతవార్త;



మండలంలోని బండారుపల్లి గ్రామంలో శనివారం హనుమ జయంతి సందర్భంగా ఆంజనేయస్వామి విగ్రహానికి ఉదయం అభిషేఖ పూజలు ఘనంగా జరిగాయి. హనుమంతుని భక్తుడు దేవరాజులు ఆర్థిక సహకారంతో మాజీ ఎంపిపి వెంకటరెడ్డి, శంకర్‌రెడ్డి, బత్తిశెట్టి, జనార్ధన్, శివ, రామభక్త బృందం, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఉదయం అభిషేఖం పూజ, సాయంత్రం భజనలు, ప్రసాద వితరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

## శివయ్య సేవలో దేశం నాయకుల పూజలు

శ్రీకాళహస్తి,జూన్ 1 ప్రభాతవార్త



మహిమాన్వితమైన శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధి సామాన్యభక్తులు, విఐపిలతో కిట కిటలాడుతుంది.శనివారం ఓ వైపు హనుమజ్జయంతి ఉత్సవాలతో మరో వైపు వారంతపు రద్దీతో కిట కిటలాడింది. ఎండ అయినా లెక్క చేయక భక్తులు తరలి వచ్చారు.ఈ నేపథ్యంలో ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, చిత్తూరుకూటమి అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ లు వచ్చారు.వారికి ఆలయం వద్ద తెలుగుదేశం నాయకులుఘనస్వాగతం ఏర్పాటు చేసారు. ఆలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరగా దేశం నాయకులు ఏర్పాటు చేసారు.ప్రత్యేక పూజల అనంతరం వారికి అంతరాలయ దర్శనాలు ఏర్పాటు చేసారు.గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఏర్పాట్లను మాజీ వ్యవసాయ మార్కెటింగ్ కమిటి అధ్యక్షుడు రంగినేని చెంచయ్యానాయుడు,హరి, బాలాజిలు పర్యవేక్షించారు.

## ముచ్చివోలులో ఆంజనేయ జయంతి

శ్రీకాళహస్తిరూరల్,జూన్ 1 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం భక్త ఆంజనేయ జయంతి ఉత్సవా లను ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రజలు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.ఈ నేపథ్యంలో మండలంలోని ఆంజనేయ పురం, ముచ్చివోలు గ్రామాల్లో ఆంజనేయ జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడ ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక అలంకారాలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆంజనేయ స్వామి భజనలు నిర్వహించారు.విగ్రహాలకు తమల పాకులతో అలంకరించారు.ఆంజనేయ పురం గ్రామం వెంకటగిరికి సమీపంలో ఉంది.ఇక్కడ స్వామికి ప్రత్యేక గుడి నిర్మించి ఉన్నారు. ముచ్చివోలులో ఆంజనేయ స్వామి గుడిలో అభిషేకాలు నిర్వహించారు. ఇక్కడ జరిపిన అలంకారాలు చుట్టుపక్కల గ్రామాల ప్రజలను ఆకట్టుకుంది.

# తిరుపతి డివిజన్

## తంగేళ్ళపాళెంలో అభయ ఆంజేయస్వామి ఆలయ నిర్మాణానికి శ్రీకారం

-పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీ

.తొట్టంబేడు, జూన్ 1 ప్రభాతవార్త



మండలంలోని తంగేళ్ళపాళెం గ్రామంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు ఎస్సీవీనాయుడు తన సొంతఖర్చులతో శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆలయ నిర్మాణ ప్రాంగణాన్ని పరిశీలించిన ఆయన పూజా కార్యక్రమాల్లో పాల్గొని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కొబ్బరికాయకొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీనాయుడు మాట్లాడుతూ అభయ ఆంజనేయుడు, పావనసుతుడు, వాయుపుత్రుడు, అంజనీపుత్రుడు అయిన ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం నేడు తమ సొంత గ్రామం అయిన తంగేళ్ళపాళెంలో ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.శ్రీకాళహస్తిలో వెలసి ఉన్న వాయులింగేశ్వరుడు అయిన శివయ్య స్వామి మరొక అవతారమే ఆంజనేయస్వామి అని తెలిపారు. వాయులింగేశ్వరుని ఆశీస్సులతో తఆము తలపెట్టిన అభయ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి ఎలాంటి ఆంటంక లేకుండా పూర్తవ్వాలని కోరుకుంటున్నా మన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యస్‌సివి.చెంచుకృష్ణమనాయుడు, యస్‌సివి కిరణ్‌కుమార్‌నాయుడు, గుడ్లూరుమోహన్‌కిషోర్‌నాయుడు, సుధాకర్‌నాయడు, గోగినేని భాస్కర్‌నాయుడు, చంద్రబాబు, వినోద్‌నాయుడు, వెంకటాద్రినాయుడు, రామకృష్ణమనాయుడు, సుదర్శన్‌నాయుడు, చరణ్‌తేజ తంగేళ్లపాళెం గ్రామస్తులు పాల్గొన్నారు.

## తుమ్మలగుంటలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

-ఆంజనేయుడుకి ప్రత్యేక పూజలు చేసిన దొడ్ల కరుణ

తిరుపతిరూరల్, జూన్01 ప్రభాతవార్త:



తుమ్మలగుంటలో శ్రీప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను ఆలయ ధర్మకర్త దొడ్ల కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని తుమ్మలగుంట ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసారు. అలాగే ఉప్పరపల్లి రామా లయం, ఉప్పరపల్లి హరిజనవాడ రామాలయం, మాతమ్మ గుడి, తుమ్మలగుంట హరిజనవాడ కృష్ణుడి గుడి, అరుంధతివాడలో మాతమ్మ గుడులలో కూడా కరుణాకర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ జయంతి వేడుకలలో పాల్గొన్న భక్తులకు లడ్డు, వడపప్పు, పానకం తీర్థప్రసాదాలు అందజేసారు. గ్రామస్తులకు ఎలాంటి ఆపద తలెత్తకుండా చూడాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీనివాసులు రాయల్, రేవంత్, భాస్కర్‌రెడ్డి, వరదరాజు రాయల్, శ్రీను, కృష్ణ, చెంచు, శేఖర్, అయ్యప్ప, సుమన్, బాలు, పవన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ముంగర కిరణ్ కుమార్ రాజుకి డాక్టరేట్ ప్రదానం

తిరుపతి విద్య, జూన్ 1, ప్రభాతవార్త



ఎస్వీ యూనివర్శిటీ అర్థ శాస్త్ర విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి ముంగర కిరణ్ కుమార్ రాజుకి డాక్టరేట్ ప్రధానం చేసినట్లు ఎస్వీ యూనివర్శిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎం. దామ్లా నాయక్ తెలిపారు. ప్రొఫెసర్ మేడసాని దేవరాజులు పర్యవేక్షణలో సోషియో ఎకనమిక్ కండీషన్స్ ఆఫ్ స్ట్రీట్ గార్మెంట్ వెండర్స్ – ఏ కేస్ స్టడీ ఇన్ చిత్తూరు డిస్ట్రిక్ట్ ఆఫ్ ఏపి అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకు అతనికి డాక్టరేట్ ప్రధానం చేసినట్లు ప్రకటించారు. ఇతను శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల, టిటిడి తిరుపతి నందు అర్థ శాస్త్ర విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు.

## సత్యవేడులో పారిశుధ్య పనులు ముమ్మరం

సత్యవేడు, జూన్ 1 ప్రభాతవార్త:



సత్యవేడు పట్టణంలో ప్రధాన వీధుల్లో పారిశుధ్య పనులు పంచాయతీ సిబ్బంది శర వేగంగా చేస్తున్నారు. ఇక్కడ రెండు రోజుల పాటు గంగజాతర జరగడం, అమ్మవారికి వేలాది మంది వేప ఆకుల చీరలతో మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో పాటు రోడ్ల ఇరువైపులా అంగళ్లు వెలసింది. దీంతో ఎక్కడబడితే అక్కడ చెత్తాచదారం, వేపాకు, ఇతర వ్యర్థాలు పడేశారు. ఎక్కువ మంది భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. టెంకాయ ఆకుల పీచులు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించిన వారు చెత్తాచదారాలను అక్కడికక్కడ వదిలేశారు. వాటిని శుభ్రం చేసే పనులు సత్యవేడు పంచాయతీ కార్మికులు మండుటెండలను కూడా లెక్కచేయకుండా చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారు. విపరీతమైన దుర్గంధం ఉన్న సత్యవేడు పారిశుధ్య కార్మికులు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ వారు చేస్తున్న శ్రమ అభినందనీయం. ఈ పనులు పంచాయతీ సర్పంచ్ మంజుల బెల్ట్ రమేష్, కార్యదర్శి ముని రవికుమార్ పర్యవేక్షణలో సాగుతోంది.

## అసలే మండుతున్న ఎండలు ఆపై విద్యుత్ సరఫరా నిలిపివేత

అధికారుల తీరుపై శ్రీసిటీ పరిధి గ్రామాల్లో ఆగ్రహం

సత్యవేడు, జూన్ 1 ప్రభాతవార్త:

ఒకవైపు భారీ ఉష్ణోగ్రతలతో జనం తలడిల్లుతున్నారు. వేడి గాలులతో ఇంట్లో ఉండడమే కష్టతరంగా ఉంది. దీనికి తోడు విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో శ్రీసిటీ పరిధి గ్రామాలు తల్లడిల్లిపోయింది. సంబంధిత శ్రీసిటీ పరిధి విద్యుత్‌శాఖ ఏఈ ఏకపక్ష నిర్ణయం వల్ల ప్రజల అవస్థలు పడుతున్నారు. మెయింటెనెన్స్ పేరిట దాదాపు నాలుగైదు గంటలు విద్యుత్ సరఫరా ఆపేయడంతో ప్రజలు, పరిశ్రమల్లో పని చేసిన కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రధానంగా వృద్ధులు పిల్లలు ఇళ్ళలో ఫ్యాన్లు తిరక్క సమీప చెట్ల వద్దకు పరుగులు పెట్టాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. కనీసం పత్రిక ప్రకటన కూడా ఇవ్వకుండా విద్యుత్ శాఖ ఏఈ గంటల తరబడి విద్యుత్ సరఫరా ఆపి వేయడం అన్యాయమైన విషయమని వినియోగదారులు వాపోతున్నారు. తనకు పెద్దల సహకారం ఉందని, తాను ఏ నిర్ణయం తీసుకున్న తనను ఎవరు ఏమీ చేయలేరని ధీమాతో వినియోగదారులకు తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. వినియోగదారుల అవస్థలు పట్టించుకోకుండా ఇక్కడ ఏఈ కాంట్రాక్టర్లకు కొమ్ము కాస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు.

## భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

పుత్తూరురూరల్, జూన్ 1 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణం మండల పరిధిలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని కార్వేటినగరం రోడ్డులో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం మూల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, అలంకరణలు చేశారు. అలాగే ఆవరణలో అన్నదానం కార్యక్రమం కూడా నిర్వహించారు. అనంతరం రాత్రి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పుష్పాలు విద్యుత్ దీపాలంకరణతో అలంకరించి మంగళ వాయిద్యాలు నడుమ స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. అలాగే మండల పరిధిలోని బత్తల మార్కెట్ సమీపంలోని విద్యానగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన అభయ ఆంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. అలాగే తణుకు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి కూడా పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

## జూడో క్రీడలో బంగారు పతకాల సాధనే లక్ష్యం

**- రాష్ట్ర స్థాయిలో మూడు శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు చర్యలు**

**- ఏపీ జూడో అసోసియేషన్ ఛైర్మన్ నాగూరయ్య వెల్లడి**



నాయుడుపేట, జూన్ 1 ప్రభాతవార్త : ప్రపంచ స్థాయిలో గుర్తింపులో ఉన్న జూడో క్రీడలో 2032 నాటికి ఏపీ నుంచి బంగారు పతకాల సాధనే లక్ష్యంగా పనిచేస్తామని ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్ నూతన ఛైర్మన్, ట్రినిటి ఆసుపత్రి అధినేత నాగూరయ్య పేర్కొన్నారు. నూతన ఛైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా ఆయన మాట్లాడారు. జపాన్ దేశంలో పుట్టిన జూడో క్రీడ తూర్పు, ఆగ్నేయ ఆసియా దేశాల్లో మాత్రమే ఉందని, మన దేశానికి ఇప్పుడిప్పుడే కొంత వరకు ఈ క్రీడ గురించి తెలుస్తూ వస్తుందన్నారు. జూడో క్రీడకు ఒలంపిక్స్‌లో 58 బంగారు పతకాలు అవకాశం ఉన్నప్పటికీ ఈ క్రీడలు ఆడటంలో ఎంతోమంది క్రీడాకారులు వెనుకబడి ఉన్నారని అన్నారు. అందుకే రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి పట్టణాల్లో ఉచిత శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఈ క్రీడలను గ్రామస్థాయిలోని జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థుల నుంచి పట్టణ స్థాయిలో పెద్దపెద్ద కళాశాలల స్థాయికి తీసుకెళ్లాలన్నదే తమ ఉద్దేశమన్నారు. ఈ క్రీడ పట్ల ప్రజలకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చే ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను వారే ఎదుర్కోవడానికి స్వీయ రక్షణ కోసం ఈ క్రీడ బాలికలకు ఎంతో అవసరమని చెప్పారు. జూడోలో శిక్షణ పొంది ఆరితేరి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆడితే ఇచ్చే పార్టిసిపేషన్ సర్టిఫికెట్ వల్ల ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంతో అవసరమవుతుందని చెప్పారు. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న గ్లోబల్ బ్రాడ్‌కాస్టింగ్ మీడియా హౌస్ వారి సౌజన్యంతో రాష్ట్రస్థాయి జూడో అసోసియేషన్‌కు తనను ఛైర్మన్‌గా చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. 20 సంవత్సరాల ప్రణాళికతో 800 కోట్ల పెట్టుబడితో ఈ క్రీడను అభివృద్ధి చేసేందుకు జివిసి మీడియా హౌస్ ముందుకొచ్చిందని ఆయన అన్నారు. క్రీడల్లో గాయపడిన వారికి అనుగుణంగా రూ.200 కోట్లతో ఓజిలి మండలం పెదపరియ వద్దనున్న క్రీడా కళాశాల ప్రాంగణంలో ప్రత్యేకంగా ఆసుపత్రి నిర్మాణం చేయడానికి ఇప్పటినుంచే ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ఈ క్రీడ పట్ల మరింత అవగాహన కల్పించేందుకు నాయుడుపేట పట్టణంలోని కెఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జూన్ 2న సాయంత్రం 4 గంటలకు ఫెసిలిటేషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో జూడో అసోసియేషన్ సభ్యులు రాయపు రమేష్‌నాయుడు, డాక్టర్ అనుదీప్, బట్టా సుబ్రహ్మణ్యం, బాలు, డాక్టర్ సందీప్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి వెండి తమలపాకుల హారం వితరణ



శ్రీకాళహస్తి, జూన్ 1 ప్రభాతవార్త : పిచ్చాటూరురోడ్డులోని బంగారమ్మ కాలనీ వద్ద వెలసిన సంకట విమోచన ఆంజనేయస్వామికి శ్రీకాళహస్తి పట్టణంలోని లక్ష్మి జ్యువలరీ ప్రొప్రైటర్ జూలుగంటి గోపికృష్ణ సుమారు రూ.40వేలు విలువచేసే 108 వెండి తమలపాకుల హారాన్ని హనుమాన్ జయంతి సందర్భంగా ఆయన అర్చకులు ప్రసాద్‌శర్మకు అందించారు. ఈమాలను స్వామివారికి అలంకరించడంతో భక్తులు తన్మయత్వం చెందారు. ఈసందర్భంగా దాతకు ఆలయంలో ప్రత్యేక అర్చనలతో పాటు పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందించి స్వామివారిఆశీస్సులు ఉండాలని కోరారు. సాధారణంగా ఎంతో భక్తిభావంతో ఉండే జూలుగంటి గోపీకృష్ణ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో తన వంతు చేయూతనందిస్తున్నారు. ప్రతి మంగళవారం తేరువీధిలో వెలసిన సుబ్రమణ్యాస్వామికి పూజా సామగ్రిని అందిస్తున్నారు. ఈసందర్భంగా సంకటవిమోచన స్వామి ఆలయ సభ్యులు జూలుగంటి గోపికృష్ణను దుశ్శాలువతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు.

## దడ పుట్టిస్తున్న బియ్యం,కందిపప్పు ధరలు



శ్రీకాళహస్తి,జూన్ 1 ప్రభాతవార్త : సమాజంలో రోజు రోజుకు బతుకు భారంగా మారుతుంది.ఈ నేపథ్యంలో నెలరోజుల క్రితం మార్కెట్లో ఉన్న ధరలకు నేటి ధరలకు ఎంతో వ్యత్యాసం చోటు చేసుకుంది. ముఖ్యంగా పప్పుల ధరలు దడ పుట్టిస్తుండగా రాబోవు రోజుల్లో అన్నం మెతుకు కూడా కరువే ఏమో అనే భయం సామాన్యుల్లో పట్టుకుంది. అయితే ధరలను నియంత్రించాల్సిన ప్రభుత్వ శాఖలు పట్టించుకోవటం లేదనే విమర్శలు చోటు చేసుకున్నాయి. మరీ ఇంత ధరల పెరుగుదలా?అని జనం తల్లడిల్లుతున్నారు.అయితే నూనె ధరలు ఉపశమనం కల్పిస్తున్నాయి.

**ఉడకని పప్పులు:**

కుటుంబం నడవాలంటే భోజనం చేయాలంటే ప్రతినిత్యం ఏదో పప్పు కావాలి. అయితే గత నెల రోజులుగా క్రమంగా కందిపప్పు, మినపపప్పు,పెసర పప్పుల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. నెల రోజుల్లో కందిపప్పు ధర 60శాతం పెరిగింది. దాంతో కొనుగోలు దారుడు బెంబేలెత్తుతున్నాడు. వివరాలను పరిశీలిస్తే మేలు రకం కందిపప్పు ధర 15రోజుల క్రితం కిలో రూ.160 నుంచి 170లుండేది.శనివారం మార్కెట్లో సచిన్ బ్రాండ్ కందిపప్పు కిలో రూ.200 తాకింది. ఇక మినప పప్పు ధర కిలో రూ.120 ఉంటే నేడు రూ.140 దాటింది. పెసరపప్పు ధర కిలో రూ.100నుంచి 125లకు పెరిగింది. ఇలా పప్పుల ధరలు పెరుగుతున్నాయి. ఇక కందిపప్పును రేషన్ షాపుల్లో ఇస్తారు.కానీ అది నాసిరకంగా ఉందని వాపోతున్నారు. కానీ రెండు నెలలుగా అది కూడా అందించటం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రతి ఇంటిలో ప్రతిరోజూ పప్పు వాడకం ఉంటుంది. రేషన్ షాపుల్లో ఇచ్చే కిలో,అర్థకిలో ఎక్కడకు సరిపోతుందని వాపోతున్నారు.

**బియ్యం ధరలకు రెక్కలు:**

రోజంతా కష్టపడితే వచ్చే కూలితో రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు బియ్యమో, నూకలో కొనుగోలు చేసి గంజి నీళ్ళు తాగే వారు. అయితే గత వారం రోజులుగా మార్కెట్లు బియ్యం ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. పచ్చిబియ్యం కిలో రూ.65కు చేరింది. సాధారణ రకాలు రూ.55 నుంచి 60 మధ్య ఉంది.ఇక ఇడ్లి తయారుచేసే బుద్దల బియ్యం రూ.32 ఉండగా నేడు 40కు దాటింది. కొందరుకూలీలు నూకలతో గంజికాసుకొని తాగేవారు. నూకల కిలో రూ.31 ఉండగా నేడు 40కు చేరింది. ఇలా బియ్యం ధరలు పెరుగుతుంటే సామాన్యుడు బెంబేలెత్తుతున్నారు.తాము సంపాదిస్తున్న సంపాదన కనీసం పప్పు,బియ్యానికి కూడా సరిపోవటం లేదని వాపోతున్నారు. మరి ధరలను నియంత్రించాల్సిన వ్యవస్థలు మౌనం వహించటం సామాన్యునికి కలవరపెడుతుంది. సామాన్యుని బతుకుభారంగా మారింది.

## కౌంటింగ్ ప్రక్రియకు సమర్ధవంతంగా ఏర్పాట్లు : ఎస్పీ

చంద్రగిరి, జూన్ 1 ప్రభాతవార్త: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున తిరుపతి, చంద్రగిరి (కూచివారిపల్లి) లో చోటుచేసుకున్న అల్లర్లు పునరావృతం కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతతో మెలగాలని తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు హెచ్చరించారు. ఎగ్జిట్‌పోల్స్ విడుదల నేపథ్యంలో శనివారం పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది, ప్రత్యేక బలగాలను టవర్‌క్లాక్ వద్ద మోహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పోలీసులకు సహకరించాలని కోరారు. తిరుపతి, చంద్రగిరిలో జరిగిన అల్లర్లు, హింసాత్మక ఘటనల నేపథ్యంలో కౌంటింగ్ ప్రక్రియకు ఎటువంటి విఘాతం కలగకుండా 2500 మంది జిల్లా పోలీసులు, మూడు కంపెనీల సాయుధ బలగాలు, మరో మూడు ప్లాటూన్ల ప్రత్యేక బలగాలతో, క్యూఆర్‌టి పికెట్లుతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ సెంటర్ వద్ద చెక్ పోస్టులు, రక్షణ వలయాలను ఏర్పాటు చేసి, అర్హులైన వారిని మాత్రమే అనుమతించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 144 సెక్షన్‌తో పాటు పోలీస్ యాక్ట్ 30 అమలులో వున్నట్లు వెల్లడించారు. 5 మందికి మించి గుమికూడకూడదని తేల్చిచెప్పారు. కౌంటింగ్ సెంటర్ వద్ద డ్రోన్ ఫ్లయింగ్ నిషేధించినట్లు తెలిపారు. మద్యం విక్రయాలను మూడు రోజుల పాటు బంద్ చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా భాణా సంచా విక్రయాలు, పేళుళ్ళకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా సామాజిక మాధ్యమాలలో పోస్టులు చేసే విషయంలో పోలీసు నిఘా వుంటుందనీ, అడ్మిన్ జాగ్రత్తగా వుండాలన్నారు. ఎవరైనా ఇష్టారాజ్యంగా పోస్టులు పెడితే చర్యలు తప్పవని తేల్చిచెప్పారు. గత కొద్దిరోజులుగా అన్ని గ్రామాలలో ప్రజలను చైతన్య పరుస్తూ ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే విధంగా సహకరించాలని కోరుతూ మైక్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. విజయోత్సవ సంబరాలు, ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదని అన్నారు.

## అర్ధగిరిలో వైభవంగా శ్రీహనుమాన్ జయంతి వేడుకలు...కిక్కిరిసిన భక్తజనం



ఆలయంలో జరుగుతున్న శ్రీఆంజనేయ సహస్రనామహోమం

తవణంపల్లె, జూన్ 1 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరగొండ అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామివారి దేవస్థానంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. దేవస్థానంలో ప్రతి ఏటా హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ఆలయ ఈఓ టి.హనుమంతరావు ఆధ్వర్యంలో ఈవేడుకలను అత్యంత ఘనంగా నిర్వహిం చారు. ఈమేరకు ఆలయ అర్చకులు ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ అనంతరం స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించి విశేషాలంకరణతో ధూపదీపనైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అదేవిధంగా ఆలయ అర్చకులు మహా మండపంలో శాస్త్రోక్తంగా కలశారాధన, 11 గంటలకు శ్రీఆంజ నేయ సహస్రనామహోమం, మంత్రపుష్పం, ఉత్సవ విగ్రహ స్నపన తిరుమంజనం, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర పూజాధి కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే సాయంత్రం తులసీ సహస్రనామ పూజ నిర్వహించారు. అలాగే రాత్రి ఏడు గంటలకు స్వామివారికి ప్రాకారోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా రాత్రిఅలంకరించిన స్వామి వారిని ప్రత్యేకపల్లకిపై వుంచి మంగళవాయిద్యాలు నడుమ సంజీవరాయని పుష్కరిణి చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ చేయించారు. రాజగోపురం నుండి మహామండపం, గర్భాలయం, అంత్రాలయంలను వివిధరకాల పుష్పాలతో అలంకరించారు. అలాగే అనుబంధ ఆలయాలైన శ్రీగణేష్ ఆలయం, శ్రీశివాలయం, శ్రీఅయ్యప్ప ఆలయంలను వివిధ రకాల పుష్పాలు, అరటిచెట్లు, మామిడి తోరణాలు విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.

ఇదిలా వుండగా శ్రీహనుమాన్ జయంతి సందర్భంగా మాలధారణ చేసిన భక్తులు అర్ధగిరి చేరుకుని స్వామివారికి ఇరుముడులను చెల్లింపులు నిర్వహించారు. వీరికి దేవస్థానం తరపున ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. హనుమాన్ జయంతి సందర్భంగా వివిధ ప్రాంతాలనుండి తరలివచ్చిన అశేష భక్తజనంతో అర్ధగిరి ఆలయం కిక్కిరిసింది. భక్తులకు దేవస్థానం తరపున ఉచిత తీర్థ, ప్రసాదాలను అందజేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ హనుమంతరావు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లును చేపట్టారు. అలాగే భక్తుల కాలక్షేపం నిమిత్తం పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

**ఆకట్టుకున్న ప్రత్యేకాలంరణ:**

శ్రీహనుమాన్ జయంతి సందర్భంగా అర్ధగిరి దేవస్థానంలో చేపట్టిన ప్రత్యేకాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. ఈమేరకు ప్రధాన ఆలయం ముందు

## రోహిణి కార్తె.. నిప్పుల కుంపటి

కోట, జూన్ 1 ప్రభాతవార్త : ప్రచండ భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. రోహిణి కార్తెలో రోళ్లు పగిలేలా ఉగ్ర రూపాన్ని చూపుతున్నాడు. వాతావరణం మార్పులతో జిల్లాలో గత కొద్ది రోజులుగా ఎండవేడిమి తగ్గినట్లు తగ్గి మళ్లీ గత నాలుగురోజుల నుంచి ఎండ మండుతోంది. ఉదయం 8 గంటల నుంచే ప్రతాపం చూపడంతో ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. అత్యవసరమైతే తలపై రక్షణగా వస్త్రాలు, గొడుగులు ఏర్పాటు చేసుకొని ప్రయాణం సాగిస్తున్నారు. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో మధ్యాహ్నం ప్రధాన కూడళ్లు సైతం జన సంచారం లేక వెలవెలబోతున్నాయి. ఎండ తీవ్రతతో విద్యుత్ ఉపకరణాలు సైతం మరమ్మతులకు గురవుతున్నాయి. సూర్యుడి భగభగలతో పిల్లలు, వృద్ధులు అల్లాడుతున్నారు. గత రెండురోజులుగా ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్నాయి.

## సూళ్లూరుపేటలో హనుమజ్జయంతి వేడుకలు



సూళ్లూరుపేట, జూన్ 1 ప్రభాతవార్త : సూళ్లూరుపేట లోని శ్రీబాలాంజనేయస్వామి దేవస్థానంలో హనుమ జ్జయంతిని పురస్కరించు కొని శనివారం బాలాంజ నేయస్వామి వారికి లక్ష తమలపాకులతో అర్చన నిర్వహించారు. హనుమంతునికి ప్రత్యేక అభిషేకాలు చేసి ఆలయ ఆవరణలోని హనుమంతుని ఉత్సవ మూర్తికి ప్రత్యేక అలంకారం చేసి వేదపండితుల నేతృత్వంలో భక్తుల చేత తమలపాకుల అర్చన పూజలు ఘనంగా చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు దివి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కార్యనిర్వహణ అధికారి మమత పర్యవేక్షణతో ఈ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయితా శ్రీధర్, కాకి శ్రీరామమూర్తి, భగవాన్‌దాస్, సురేష్, రాజేంద్ర, బాబురెడ్డి, వెంకటసుబ్బయ్య, పోలూరు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమజ్జయంతి



తిరుపతి రూరల్, జూన్ 1 ప్రభాతవార్త : తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకంలో వెలసిన శ్రీవీరాంజ నేయస్వామి ఆలయంలో ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు జరిగాయి. శనివారం ఉదయం 7 గంటలకు గణపతి పూజ నిర్వహించారు. అనంతరం స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. పలు గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. రాత్రి కుంట్రపాకం, తనపల్లి, నల్లమానికాల్వ గ్రామ భక్తాదులచే హారేరామ భజనలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మల్లిరెడ్డిగారి భాస్కరరెడ్డిచే ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## పవన పుత్ర పాహిమాం



చౌడేపల్లి, జూన్ 1 ప్రభాతవార్త : లంకలో వున్న సీతమ్మ జాడను రామయ్యకు చెప్పి సుందర కాండకు మూల పురుషుడయ్యావయ్యా... పవనపుత్ర పాహి మాం... అంటూ భక్తులు మొకరిల్లారు...హనుమ జయంతి సందర్భంగా స్థానిక కమలాంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. వేదపండితుడు సత్యనారాయణశర్మ ఆలయ ప్రధానార్చ కుడు వశిష్టాచార్యుల ఆధ్వర్యంలో ఉదయాన్నే స్వామివారికి విశేషాభిషేకం, అలంకరణ గావించారు. రాత్రి ఆలయ ధ్వజస్తంభంపై జ్యోతిని నెలకొల్పారు. హనుమజయంతిని పురష్కరించుకొని ఆలయాన్ని వివిధ పూలు, విద్యుత్‌దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. చుట్టుపక్కల నుంచి విశేష సంఖ్యలో వచ్చిన భక్తులకు మిద్దింటి కిషోర్ ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. అదే విధంగా స్థానిక హరిమందిరం, గడ్డంవారిల్లి, కరణంవారిపల్లి, రాజనాలబండ, నడుమూరు తదితర ప్రాంతాల్లో హనుమాన్ జయంతి సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. వినాయక యువజన కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## శేష వాహనంపై శ్రీప్రసన్న రంగనాథ స్వామి



తిరుపతిరూరల్, జూన్ 1 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ బ్రాహ్మణపట్టులో వెలసిన శ్రీప్రసన్న రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం శ్రీప్రసన్న రంగనాథ స్వామి శేష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రీప్రసన్న రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు గత నెల 29 నుండి జూన్ 6వ తేదీ వరకు జరగనున్నాయి. స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం శేష వాహనంపై ఊరేగారు. సాయంత్రం స్వామివారి కళ్యాణోత్సవం, 2వ తేదీన ఉదయం హనుమంత వాహనోత్సవం, సాయంత్రం గరుడోత్సవం, 3వ తేదీన ఉదయం సింహ వాహనోత్సవం, సాయంత్రం గజ వాహనోత్సవం, 4వ తేదీన ఉదయం రథోత్సవం, సాయంత్రం అశ్వ వాహనోత్సవం, 5వ తేదీ ఉదయం పుష్పయాగం, సాయంత్రం శయనోత్సవం జరగనున్నది.

## జెఆర్ఆర్ టవర్స్‌భవనంలో భారీ శబ్దాలు

**భయభ్రాంతులకు గురైన ప్రజలు**

శాంతిపురం జూన్1 ప్రభాతవార్త : మండలకేంద్రమైన శాంతిపురంలోని జెఆర్ఆర్ టవర్స్ భవనంలో ఉన్న రెండోఅంతస్తు నుండి భారీశబ్దాలు రావడంతో శనివారం రాత్రి స్థానికులు భయాందోళనకు గురైయ్యారు స్థానికంగా ఉన్న జెఆర్ఆర్ టవర్స్‌భవనంలో రెండోఅంతస్తులో త్రివేణిఒన్‌గ్రామ్ గోల్డుజువలరీ దుకాణంఉంది. ఈ దుకాణంనుంచి శనివారం రాత్రి7గంటల ప్రాంతంలో భారీపేలుడు శబ్దాలు రావడంతో స్థానికులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురైయ్యారు.ఆ దుకాణంనుంచి పొగలుకూడా రావడంతో అగ్నిప్రమాదం జరిగిఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తచేశారు.విద్యుత్ అధికారులు స్థానికులు సమాచారం అందించడంతో విద్యుత్‌సరఫరాను నిలిపివేశారు.అనంతరం సమాచారం అందుకున్న కుప్పం ఫైర్‌సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని ఒన్‌గ్రాయ్‌గోల్డ్ దుకాణం తలుపులు తెరచి లోపల ఏమి జరిగిందోననే విషయాన్ని కనుగొడంలో నిమగ్నమయ్యారు.

## తిరుచ్చి వాహనంపై శ్రీనివాసుడు



చంద్రగిరి, జూన్ 1 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీనివాసుడు తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాది నిత్యకైంక ర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత స్వామివారి ఉత్సవమూ ర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాద్, సూపరింటెండెంట్ తేనెపల్లి వెంకటస్వామి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు కె.ఎస్.ఆంజనేయాచార్యులు, ఆలయ సిబ్బంది రవిచంద్రన్, ఘనాపాటి తిరువెంగడం, జమేధర్ గంగాధర్, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## ఘంటసాల విగ్రహానికి పాలాభిషేకం



తిరుపతి,జూన్ 1 ప్రభాతవార్త: సుప్రసిద్ధ భక్తిగీతాల గాయకుడు ఘంటసాల పలు పాటలతో తెలుగుప్రజల గుండెల్లో నిలబడిపోయారని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. భౌతికంగా మన మధ్యలేకున్నా పాటల్లో ఆయన నిత్యం బ్రతికే ఉన్నారన్నారు. తిరుపతిలోని భవానీనగర్‌కూడలిలో ఉన్న అమరగాయకుడు ఘంటసాల విగ్రహానికి నెలమొదటిన శనివారం ఉదయం రాయలసీమ రంగస్థలి కళాకారులు పాలాభిషేకం చేశారు. ఘంటసాల తెలుగుప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గాయకుడని కొనియాడుతూ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కళాకారులు కెఎన్ రాజా, అక్కిపల్లి మునికృష్ణయ్య యాదవ్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, ఆంజనేయులు, చంద్రశేఖర్, కస్పాపద్మనాభం, ఉపాధ్యాయుడు తిరుమలయ్య తదితరులు పుష్పాంజలి ఘటించారు.

## రామనామసంకీర్తనలతో మార్మోగిన తిరుపతి



తిరుపతి,జూన్ 1 ప్రభాతవార్త: హనుమజ్జ యంతిన... ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో రామనామసంకీర్తనలు మిన్నంటాయి. రాయలసీమ రంగస్థలి సంస్థ కళాకారులు ప్రతి శనివారం వేకువజామున నగరంలో ఆధ్యాత్మిక శోభతో భజనలు చేసుకుంటూ....గోవింద నామాలు, రామ నామాలతో పురవీధుల్లో ఊరేగింపు చేస్తారు. శనివారం వేకువజామున రామనామంతో గోవింద రాజస్వామి ఆలయ మాఢవీధులు మార్మోగాయి. నగరసంకీర్తనలో భాగంగా ఆంజనేయస్వామికి అభిషేకాలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఈకార్యక్రమంలో గుండాల గోపీనాథరెడ్డి, కృష్ణమూర్తిరెడ్డి, జయరామ్, జయమ్మ, మునిరత్నం, తిరుపాల్ ఆచారి, కస్పా పద్మనాభమ్, నవీన్‌రెడ్డి, బాబు, సుబ్రమణ్యంరెడ్డి, నాదమునిరెడ్డి, పొన్నాల జేజిరెడ్డి తదితరులు భజనల్లో పాల్గొన్నారు. తిరుపతి నగరంలోని అభయ ఆంజనేయస్వామి ఆలయం, కృష్ణాపురంఠాణాలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం, గాంధీరోడ్డులో ఆంజనేయ ఆలయాల్లో విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి, భక్తులు హనుమంతుని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు.

## రికార్డు స్థాయిలో అభిషేకాలు, పూజలు

శ్రీకాళహస్తి,జూన్ 1 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం రికార్డు స్థాయిలో అభిషేకాలు, పూజలు జరిగినట్లు ఆలయ ఇఓ ఎస్‌వి నాగేశ్వరరావు తెలిపారు. వచ్చిన భక్తులకు సుదర్శనం, సత్వర దర్శనాల కోసం ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నామని వివరించారు. శనివారం సుమారు 30వేల మంది స్వామి అమ్మవార్లను దర్శించుకొని ఉంటారని వివరించారు. ఈ నేపథ్యంలో స్వామి అమ్మవార్ల అభిషేకాలు 80, శనివారం కాబట్టి శనీశ్వరస్వామికి 108 అభిషేకాలు సాయంత్రం నిర్వహించే మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 35 ఇక ఆలయానికి ప్రదాన ఆదాయ మార్గమైన రాహుకేతుదోష నివారణ పూజలు 4526 జరిగినట్లు ఇఓ నాగేశ్వరరావు వివరించారు. ఇక ప్రత్యేక దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసిన వారి సంఖ్య 3691గా ఉంది. ఓవైపు వేసవి ఎండలు దడ పుట్టిస్తున్నా ఖాతరు చేయక స్వామి అమ్మవార్ల అనుగ్రహం కోసం తరలివచ్చారు.

## ముక్కంటీశుని ఆలయం...శివనామస్మరణతో పునీతం



శ్రీకాళహస్తి, జూన్ 1 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తులతో కిట కిట లాడింది. ఉదయం నుంచి ఆలయంలో ఎటు చూసినా భక్తుల శివనామస్మరణతో పునీతమైంది. అంతేకాక శనివారం కావటంతో శనీశ్వరుని ఆలయం వద్ద, అభయ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. అభయ వెంకటేశ్వరస్వామి నిలువెత్తు విగ్రహాన్ని కన్నులుమిరుమిట్లు గోల్పు నట్లు ముస్తాబు చేసారు.శనీశ్వరుని విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు జరిపారు. వేదపండితులు, అర్చకులు స్వామి సన్నిధిలో వేద మంత్రాలను పఠిస్తూ షోడశాభిషేకాలు జరిపారు. ఇక రాహుకేతుదోష నివారణ పూజలు కూడా రికార్డు స్థాయిలో జరిగాయి.ఇటీవల కాలంలో శ్రీకాళహస్తీశ్వరా లయం లో భక్తుల రద్దీ పెరిగింది. ముఖ్యంగా రాహుకేతు దోష నివారణ పూజలు జరిపించుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది.శనివారం ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరోవైపు అతిధులతో కళ కళ లాడింది.

**అనూహ్యంగా పెరిగిన రద్దీ:**

నాలుగైదు రోజులుగా పరిమితంగా ఉన్న భక్తుల సంఖ్య శనివారం ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. దేవస్థానం అందించిన సమాచారం మేరకు సుమారు 30వేల మంది శనివారం స్వామి అమ్మవార్లును దర్శనం చేసుకున్నారని ఆలయాధికారులు చెబుతున్నారు. రికార్డు స్థాయిలో రాహుకేతు దోష నివారణ పూజలు జరిగినట్లు వివరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది ఆలయ ఎఇఓ సతీష్‌మాలిక్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు హరియాదవ్, సుదర్శనం, వారి సహచరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

**నామమాత్రంగా మారిన నిబంధనలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులు ఆలయంలో రోజుకొక నిబంధనలతో సతమతమౌతున్నారు. ఇక్కడ అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలుల మొక్కుబడిగా మారాయి. నిబంధనలు రూపకల్పన చేసిన అధికారులు వాటి ఆచరణలో ఎందుకో కఠినంగా వ్యవహారించలేకపోతున్నారు. ఇక పిఆర్‌ఓ కార్యాలయం నుంచి కొందరు విఐపిల ముసుగులో అంతరాలయ దర్శనానికి తీసుకెళ్ళటంతో భక్తుల్లో అసహనం చోటు చేసుకుంది. దేవుని ముందు అందరూ సమానులే అంటారు.కానీ శ్రీకాళహస్తీశ్వరాల యంలో 'పలుకుబడికే పెద్ద పీట అన్నట్లు మారింది. ఇక్కడ చట్టాలు కొందరికి చుట్టాలుగామారి కనకవర్షం కురిపిస్తుంది.ఇక కొన్ని గేట్ల వద్ద సెక్యూరిటి సిబ్బందియేదళారుల అవతారమెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో కౌంటర్ల సమీపంలో సినిమా టిక్కెట్లును బ్లాక్‌లో అమ్మినట్లు అమ్మటం గమనించదగ్గ విషయం. దిశ దెశ నిర్దేశం లేని నిబంధనలతో స్వామి అమ్మవార్ల ఆలయాల వద్ద ఉన్న సిబ్బంది ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

## సంకట విమోచన ఆలయంలో విశేషపూజలు

**-హోమాలు, భక్తులకు అన్నదానాలు -భక్తులతో కిటకిటలాడిన ఆలయం**



.తొట్టంబేడు, జూన్ 1 ప్రభాతవార్త : మండలకేంద్రానికి సమీపంలోని బంగారమ్మ ఆలయం పక్కనే వెలసిన సంకటవిమోచన ఆలయంలో వెలసిన ఆంజనేయస్వామికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణ నిర్వహించారు. అనంతరం భక్తులతో ఆలయం కిటకిటలాడింది. హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయలో ఉత్సవమూర్తికి ప్రత్యేక అభిషేకాలు అలంకరణ నిర్వహించారు. కాగా పక్కనే ఉన్న నిలువెత్తు హనుమంతుని విగ్రహానికి అభిషేకాలు నిర్వహించి తమలపాకులమాలతో విశేషాలంకరణ నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేకహోమాలు, అర్చనలు నిర్వహించడంతోపాటు పలువురు భక్తులకు ప్రసాదాలు పంపిణీచేశారు. కాగా తొట్టంబేడు మండల నాయకుడు కె.భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిలువెత్తు ఆంజనేయస్వామికి పూలమాల, తమలపాకుల మాలవేసి మొక్కుతీర్చుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్నినిర్వహించడంతో పాటు రాత్రి పురవీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి ప్రసాద్‌శర్మ పలువురు అర్చకులు కాలనీ వాసులు పాల్గొన్నారు.